క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు ప్రారంభం



జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: పట్టణంలోని నవనంది హైస్కూల్‌లో రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలను మంగళవారం ఎమ్మెల్యే జయసూర్య జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. 15 జిల్లాల నుంచి 13 జట్లు బాలికలు, 13 బాలుర జట్లు పోటీల్లో పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు,. చిన్నారుల నృత్యాలు చూపర్లను ఆకట్టుకున్నాయి. రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ క్రీడల్లో ప్రతిభకనబరిచిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నవనంది స్కూల్ కరస్పాండెంట్ శ్రీధర్, మారుతి, నాయకులు ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేషపూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఆలయ ప్రాంగణంలోని కుమార స్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్రపారాయణలు చేశారు.

రిటైర్డ్ హెచ్‌ఎం ప్రసాదరావు మృతి

నందికొట్కూరు: పట్టణంలోని సీఎస్ఐ ప్రాథమిక పాఠశాల రిటైర్డ్ హెచ్‌ఎం ప్రసాదరావు మంగళవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ హాజీ నగర్‌లోని ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దారా సుధీర్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడి 35 ఏళ్ల పాటుగా సేవలందించారన్నారు. ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారన్నారు. ఎందరో ఉన్నత స్థాయిలో నిలిచారని చెప్పారు.

మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు

మిడుతూరు: పంట సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని నందికొట్కూరు ఏడీఏ విజయశేఖర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రోళ్లపాడు, అలగనూరు, తలముడిపి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం రబీలో సాగు చేపట్టిన మినుము, మొక్కజొన్న, కంది పంటను ఆశించే చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను (పీఎంఎఫ్‌బీవై) సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీలో సాగు చేపట్టిన పంటలకు ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పీరునాయక్, అగ్రికల్చర్ అసిస్టెంటు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండాలి

నందికొట్కూరు: అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం సూచించారు. మంగళవారం మండల పరిధిలోని అల్లూరు, కోనేటమ్మపల్లి, వడ్డేమాన్ గ్రామాల్లోని సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విధులు సక్రమంగా నిర్వర్తించాలన్నారు. గ్రామాల ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కార మార్గం చూపించాలని సూచించారు. అనంతరం బ్రాహ్మణకొట్కూరు గ్రామంలోని పంట కాలువలను పరిశీలించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవ పూజల్లో తండా వాసులు

వెలుగోడు: పట్టణంలోని జమ్మి నగర్ తండాలో సంత్ సేవాలాల్ మహారాజ్ మారెమ్మ యాడి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. పెద్దఎత్తున బంజారాల కుటుంబాలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొన్నారు.

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

జూపాడుబంగ్లా: అల్పపీడనం కారణంగా వర్షాలు కురిసే అవకాశాలున్నందున వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని 80బన్నూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. కోతదశలో ఉన్న వరిపంట వర్షానికి ముందుగా కోసుకోవద్దని సూచించారు. కోసిన పంట వర్షానికి తడిసి మొలకెత్తకుండా ఉప్పుద్రావణాన్ని వరి కుప్పలపై చల్లుకోవాలన్నారు.

భారత రాజ్యాంగం ప్రపంచానికే ఆదర్శం

● ఘనంగా రాజ్యాంగ దినోత్సవం
● అంబేడ్కర్‌కు ఘన నివాళి

నందికొట్కూరు: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దారా సుధీర్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మంగలి కృష్ణ, నాయబ్, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని నాగటూరులో అంబేడ్కర్ విగ్రహానికి, కొణిదేల హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచు నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, నాయకులు అక్తర్‌బాషా, సలాంఖాన్, ఉపేంద్రారెడ్డి, రమేష్‌నాయుడు, అబుబక్కర్ తదితరులు పాల్గొన్నారు.

● **మిడుతూరు:** స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ దశరథరామయ్య అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● **పాములపాడు:** స్థానిక బస్టాండులోని అంబేడ్కర్ విగ్రహానికి ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు అబ్రహాం మిఠాయిలు పంపిణీ చేసి అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు.

● **పగిడ్యాల:** స్థానిక గ్రామ సచివాలయం 1లో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

● **వెలుగోడు:** స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మొయినుద్దీన్, రవిశంకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



నందికొట్కూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద జోహార్లు అర్పిస్తున్న డాక్టర్ దారా సుధీర్ తదితరులు

● **శ్రీశైలంప్రాజెక్ట్:** శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం కార్యాలయ ప్రాంగణంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులకు అంబేడ్కర్ జీవిత చరిత్ర, భారతరాజ్యాంగం విశిష్టత గురించి వక్తలు వివరించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్‌కులాల సంక్షేమ సంఘం నాయకులు వేశపోగు లక్ష్మయ్య, పిల్లి వెంకటేశ్వర్లు, జి.ప్రకాశ్, విగ్రహదాత మూల ఏడుకొండలు, దళిత నాయకులు మైలా తులసీరాం, కల్లకుంట ఈశ్వరయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్.ఎం.బుచ్చయ్య ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు.

● **బండిఆత్మకూరు:** మండల పరిధిలోని సింగవరం గ్రామంలో ఎంపీడీఓ దస్తగిరి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఓ వసుధ తదితరులు పాల్గొన్నారు.

● **ఆత్మకూరు:** ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు చిలుక రాబిన్సన్ మాదిగ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బాషా పోగుల, దరగయ్య మాదిగ, మదనపల్లి బుజ్జి మాదిగ, ఓనమాల పుల్లయ్య మాదిగ, మిద్దెల వరదరాజు మాదిగ, నాని మాదిగ పాల్గొన్నారు.

● **మహానంది:** రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వీర జయలక్ష్మి, ఓఎస్‌ఏ డాక్టర్ ఎల్. విజయభాస్కర్, ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, డాక్టర్ మల్లేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మహానంది: అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పి వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు



మిడుతూరులో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ దశరథరామయ్య



పగిడ్యాలలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్పంచ్ శేషన్న



శ్రీశైలం ప్రాజెక్ట్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద..



జూపాడుబంగ్లా అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు



వెలుగోడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పంటలకు బీమా తప్పనిసరి



రైతులకు సూచనలిస్తున్న డీఆర్‌సీ ఏఓ హేమలత

ఆత్మకూరు: రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని డీఆర్‌సీ ఏఓ హేమలత రైతులకు సూచించారు. మంగళవారం మండల వ్యవసాయ అధికారి విష్ణువర్ధన్‌రెడ్డితో కలిసి ఆమె మండలంలోని బాపునంతపురం సమీపంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎకరా శనగకు రూ.84, జొన్నకు రూ.59.60, మినుముకు రూ.47.60, వరికి రూ.126, ఉల్లికి రూ.90 చొప్పున బీమా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు. మరిన్ని వివరాలకు రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



మహన్యాస పూర్వక రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

వెలుగోడు: పట్టణంలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో పురోహితులు రామేశ్వర సోమయాజు శర్మ ఆధ్వర్యంలో మంగళవారం సామూహిక మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రుద్రాభిషేకంతోపాటు సత్యనారాయణ స్వామి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో పురోహితులు యజ్ఞ నారాయణ శర్మ, రవికుమార్ శర్మ, ప్రభాకరశర్మ, శ్రీనివాస శాస్త్రి, రామయ్య శర్మ పాల్గొన్నారు.

పాలన మరిచి ప్రతిపక్షంపై దాడులా?



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరురూరల్: పాలన మరిచి ప్రతిపక్షంపై దాడులు చేసుకుంటూ ఉండటమే లక్ష్యమా వైఎస్సార్‌సీపీ నాయకులు, శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అధికార పార్టీ నాయకులను ప్రశ్నించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలను నెరవేర్చేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం మాత్రం ఒక్క హామీ కూడా నెరవేర్చక పోగా వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియాను, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు పాల్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మహానంది మండలానికి చెందిన సోషల్ మీడియా సభ్యుడు కృష్ణపై కర్నూలులో, నందవరంలో, చిత్తూరు జిల్లాలో, తూర్పు గోదావరి జిల్లాలో కేసులు పెట్టడమంటే వేధించడం కాక మరేమిటని ప్రశ్నించారు. రాజకీయాల్లో విలువలకు కట్టుబడి ఉన్నామని, అది చేతగాని తనంగా భావించరాదని ఆయన హెచ్చరించారు. నియోజకవర్గంలోని కార్యకర్తలెవరూ భయపడవద్దని, తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. జనవరిలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియోజకవర్గాల్లో పర్యటించి ముఖ్య కార్యకర్తలతో సమావేశం కానున్నారన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్రీశైలం నియోజకవర్గంలో అన్ని చోట్ల నుంచి తమ పార్టీ పోటీలో ఉండడమే కాకుండా ప్రజల ఆశీస్సులతో మెజారిటీ స్థానాలు దక్కించుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. అంతకుముందు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాజమోహన్ రెడ్డి, బాలస్వామి, సయ్యద్ మీర్, యూనిస్‌బాషా, జయకృష్ణ, నాగేశ్వరరెడ్డి, రామచంద్రుడు, వెంకటస్వామి గౌడు, అంజాద్, రమేష్ శెట్టి, అంజాద్ అలి, సురేష్ పాల్గొన్నారు.

ఆదరించేవారేరి?

● వారం రోజులుగా బస్టాండులోనే

మిడుతూరు: వృద్ధాప్యం.. అందులోనూ అంధుడు.. కుటుంబ సభ్యుల మధ్య ఆదరాభిమానాలు, ప్రేమానురాగాల మధ్య జీవితాన్ని గడపాల్సిన సమయంలో బస్టాండులోనే కాలం వెల్లదీస్తున్న ఘటన స్థానికులను కలచివేస్తోంది. మండల కేంద్రమైన మిడుతూరులో పోలీస్ స్టేషన్ ఎదుట ఓ వృద్ధుడు నాలుగు రోజులుగా అక్కడే ఉండటంతో స్థానికులను కలచివేస్తోంది. పోలీస్ స్టేషన్ ఎదుటే ఉన్న వృద్ధుడి పట్ల మానవత్వంతో స్పందించాల్సిన పోలీసులు స్టేషన్ నుంచి బయటికి, లోపలికి వెళ్తున్నారే తప్పా అతని వివరాలు తెలుసుకొని, కుటుంబసభ్యుల వద్దకు చేర్చే ప్రయత్నం చేయకపోవడం పట్ల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వృద్ధుడి దీనావస్థను చూసి పలువురు తమకు తోచిన విధంగా అన్నపానీయాలను అందజేస్తున్నారు.



స్టేషన్ ఎదుట దీనస్థితిలో ఉన్న వృద్ధుడు

హైవే పనులకు ఆటంకం కలిగించొద్దు

పాములపాడు: హైవే నిర్మాణ పనులకు ఎవరూ ఆటంకం కలిగించకూడదని తహసీల్దార్ సుభద్రమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని రుద్రవరం గ్రామ సమీపంలో ఉన్న జెరుషలేంశాల వద్ద నిర్వాహకులతో మాట్లాడారు. చర్చిని కూలుస్తామంటే ఒప్పుకోమని భక్తులు తహసీల్దార్‌తో చెప్పారు. కాగా ఇప్పటికే రెండు పర్యాయాలు నోటీసులు ఇచ్చామని జాతీయరహదారి నిర్మాణం కోసం సేకరించిన స్థలం విషయంలో ఎలాంటి అభ్యంతరాలు చెప్పరాదని తహసీల్దార్ సూచించారు. షెడ్డు నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్ నిర్వాహకులు స్వతహాగా తీసుకోవాలని లేకపోతే కూల్చడం తప్పనిసరి అని హెచ్చరించారు. ఆమె వెంట వీఆర్వో రాము తదితరులు ఉన్నారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

పగిడ్యాల: రబీ సీజన్ కింద కంది, మినుము, శనగ పంటలు సాగు చేసే రైతాంగం తప్పనిసరిగా విత్తన శుద్ధి చేసుకోవాలని నందికొట్కూరు ఏడీఏ విజయ్‌శేఖర్ సూచించారు. మంగళవారం మండలంలోని పడమర ప్రాతకోట, ఎం.ఘణపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విత్తన శుద్ధి చేసుకోవడం వలన విత్తనం నుంచి సంక్రమించే తెగుళ్ల నివారించుకోవచ్చన్నారు. కందిలో అధిక దిగుబడులు సాధించాలంటే మరక మచ్చ తెగులు నివారణకు వేప గింజల కషాయం పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ విజయ్‌జ్యోత్‌కుమార్, వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

బీమా చేయించుకోవాలి

నందికొట్కూరు: మండల పరిధిలోని మల్యాల పొలిమేరలోని మొక్కజొన్న పొలంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ విజయశేఖర్, , ఏఓ షేక్షావలి, సిబ్బంది రబీ సీజన్‌లో వేసిన పంటలకు బీమా చేయించుకోవాలని రైతులకు సూచించారు.



రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ విజయ్‌శేఖర్

ప్రకృతివ్యవసాయంతో అధికదిగుబడి

కొత్తపల్లి: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుంటే అధికదిగుబడి సాధ్యం అవుతుందని ఆత్మకూరు ఏడీఏ బి. ఆంజనేయ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాలెంచెరువు గ్రామంలో పొలంపిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా వరిపంటలో పంటకోత ప్రయోగం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ కే.మహేష్, వ్యవసాయ సహాయకుడు జాహీద్, ప్రకృతి సేద్య సిబ్బంది నాగరాజు, తలారులు పాల్గొన్నారు.

వంచించడం బాబుకు వెన్నతో పెట్టిన విద్య

జూపాడుబంగ్లా: మహిళలను, రైతులను, నిరుద్యోగ యువతీ, యువకులను నమ్మించి వంచించడం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వెన్నతో పెట్టిన విద్య అని నందికొట్కూరు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ దారా సుధీర్ అన్నారు. మంగళవారం మండలంలోని పి.లింగాపురం గ్రామంలో సర్పంచ్ నాగార్జునరెడ్డి ఇంటి వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికార దాహంతో చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో రాష్ట్ర బడ్జెట్ తెలుసుకోకుండా నోటికొచ్చినట్లుగా సూపర్‌సిక్స్ పథకాలంటూ హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టారన్నారు. అధికారంలోకి వచ్చాకా మొదటి సంతకం సూపర్‌సిక్స్ పథకాలపై చేస్తానని చెప్పి ఇప్పటిదాకా వాటిని అమలు చేయకుండా ప్రజల దృష్టి మళ్లించేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులపై రోజుకో అంభాండం మోపుతున్నారని విమర్శించారు. పథకాలను అమలుచేసే ఆలోచన చంద్రబాబుకు ఏకోశానలేదన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి రాగానే ఆరు మాసాల్లో అమలు చేశారని గుర్తుచేశారు. టీడీపీ సోషల్ మీడియా వారు వైఎస్సార్‌సీపీ నాయకులను విమర్శిస్తూ పోస్టులు పెడితే వారిపై కేసులుండవు. అదే వైఎస్సార్‌సీపీ వారు సోషల్ మీడియాలో పోస్టులు పెడితే తప్పుడు కేసులు బనాయించటం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. పరమపవిత్రమైన తిరుపతిలడ్డూ పై తప్పుడు ప్రచారం చేయటం చంద్రబాబుకే చెల్లిందన్నారు. అదానీతో జగన్‌మోహన్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేకపోయినా ప్రజలను పక్కదారి పట్టించేందుకు ఆయన అభాండాలు మోపుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోసిక కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోకల కృష్ణారెడ్డి, నాయకులు కోసిక తరుణ్‌కుమార్‌రెడ్డి, చిన్నమల్లయ్య, నాగసేనారెడ్డి, రామలింగారెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దారా సుధీర్

మృతుని కుటుంబానికి అండగా ఉంటా

జూపాడుబంగ్లా ప్రభుత్వ మద్యం దుకాణంలో సేల్స్‌మెన్‌గా విధులు నిర్వహిస్తూ ఈ ఏడాది అక్టోబర్ 1న బైక్‌పై ఇంటికి వెళ్తూ ప్రమాదానికి గురై మృతిచెందిన కాసపోగు నరేష్(30) కుటుంబాన్ని డాక్టర్ దారా సుధీర్ పరామర్శించారు. పి.లింగాపురం గ్రామంలోని మృతుని స్వగృహానికి చేరుకొని అతని చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. మృతుని భార్య యశోదను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆమెను ఓదార్చిన దారా సుధీర్ ఇద్దరుపిల్లల చదువులకు అయ్యే ఫీజులను భరిస్తానని, అవసరమైతే ఏదేని ప్రైవేటు కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు యత్నిస్తానని, ఎలాంటి అవసరం వచ్చినా తనకు ఫోన్‌చేస్తే సహాయం అందజేస్తానని భరోసానిచ్చారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెలుగోడు: వెలుగోడు - వేల్పనూరు గ్రామాల మధ్య బడుగుల వాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కురువ వెంకటేశ్వర్లు (58) మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. వేల్పనూరు గ్రామానికి చెందిన కురువ వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు బైకుపై వెలుగోడుకు కరెంట్ సామగ్రిని కొనుగోలు చేసేందుకు బయలుదేరారు. వెలుగోడు నుంచి టాటా ఏస్ వాహనం వేల్పనూరు వైపు వెళ్తూ బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో వెంకటేశ్వర్లు తలకు, శ్రీనివాసులుకు కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా వెంకటేశ్వర్లు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీనివాసులుకు ప్రథమ చికిత్స అనంతరం నంద్యాల శాంతిరాం వైద్యశాలకు తరలించారు. మృతునికి భార్య లక్ష్మీదేవి, ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు లక్ష్మీనరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విష్ణు నారాయణ తెలిపారు.

● **అడ్డదారి**



టీడీపీ నాయకుడి ఫాంహౌస్ వరకు సీసీ రోడ్డు వేసేందుకు కంకర వేసిన దృశ్యం

శ్రీశైలంప్రాజెక్ట్: సున్నిపెంట గ్రామంలో అంతర్గత సిమెంట్‌కాంక్రీట్ రోడ్లకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదే అదునుగా తీసుకున్న ఓ టీడీపీ నాయకుడు తన ఫాంహౌస్‌కు సీసీ రోడ్డు వేసుకునేందుకు సిద్ధమయ్యారు. అందులోభాగంగా ఇప్పటికే కంకర వేసే పనులు కూడా పూర్తి చేసుకున్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతుండటంతో సదురు టీడీపీ నాయకుడిని ఎమ్మెల్యే మందలించినట్లు తెలిసింది.

విద్యుత్ లైన్ ఏర్పాటుకు భూమిపూజ

కొత్తపల్లి: మండలాన్ని అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషిచేస్తానని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. మంగళవారం మండల పరిదిలోని సంగమేశ్వరం వద్ద సంగమేశ్వరం-జానాల గూడెం వరకు నూతన విద్యుత్‌లైన్ ఏర్పాటుకు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తపల్లి మండలం మారుమూల ప్రాంతమని, అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. అన్ని విషయాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. సంగమేశ్వం నుంచి జానాల గూడెంలో వరకు 7 కిలోమీటర్ల మేర రూ.96 లక్షల వ్యయంతో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే శివపురం సంగమేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని సందర్శించి నీటిని విడుదల చేశారు.

సిద్ధేశ్వరం భూముల సమస్యకు పరిష్కారం చూపిస్తాం

సంగమేశ్వరం వద్ద జానాలగూడెం, బలపాలతిప్ప, సిద్ధేశ్వరం గ్రామస్తులు కలసి నీటిమునక భూమల సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. త్వరలోనే అందరి అధికారుల సమన్వయంతో నీటిముంపు భూముల సమస్యను రూపుమాపుతామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్‌ఈ సుధాకర్ కుమార్, ఈఈ జయశంకర్, డీఈ రామ సుబ్రహ్మణ్యం, ఏఈ అబ్దుల్ అబీద్, తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో మేరీ, జెడ్పీటీసీ సోమల సుధాకర్ పాల్గొన్నారు.



విద్యుత్ లైన్ ఏర్పాటు భూమిపూజ చేస్తున్న దృశ్యం

శ్రీశైలం ఘాట్ రోడ్ ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తాం

● రాష్ట్ర హోంమంత్రి అనిత

శ్రీశైలంటెంపుల్: అటవీశాఖ, పోలీసు, దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష చేసి శ్రీశైలంలో నెలకొనే ట్రాఫిక్ సమస్య పరిష్కరిస్తామని హోంమంత్రి వంగలపూడి అనిత హామీ ఇచ్చారు. మంగళవారం శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను ఆమె కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. శ్రీశైలం ఘాట్ రోడ్‌లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యను నంద్యాల ఏఎస్పీ యుగంధర్ బాబు హోం మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. శ్రీశైలం నుంచి సాక్షి గణపతి, హఠకేశ్వరం వరకు ఇరుకైన రోడ్లు కావడంతో ట్రాఫిక్ ఏర్పడుతుందని మంత్రికి వివరించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లోపు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాల్సిన అవసరముందని మంత్రి అభిప్రాయపడ్డారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల దృష్టికి తీసుకెళ్లి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రశాంతంగా జీవించాలి

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ ఎం.కేశవ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నందికుంట గ్రామంలో రాత్రి పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. అయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎటువంటి గొడవలు, అల్లర్లు, ఘర్షణలకు చోటులేకుండా ప్రజలు జీవనం సాగించాలన్నారు. ప్రధాన కూడలీలలో, దేవాలయాలు, పాఠశాలలు, చర్చీలు, మస్జీదులు వద్ద సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

పంటల బీమా చేయించుకోవాలి



తంగడంచ ఫారంలో సాగుచేసిన కందిపంటను పరిశీలిస్తున్న డీఏఓ మురళీకృష్ణ

జూపాడుబంగ్లా: జిల్లా వ్యాప్తంగా ఇప్పటిదాకా 1,081 మంది రైతులు మాత్రమే రబీలో సాగుచేసిన పంటలకు ప్రీమియం చెల్లించి బీమా చేయించుకున్నారని, మిగతా వారు కూడా బీమా చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ సూచించారు. మంగళవారం ఆయన తంగడంచ ఫారంలో సాగుచేసిన కంది పంటను, సీడ్‌హబ్‌కు కేటాయించిన భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెగాసీడ్ పార్కు విషయం సీఎం దృష్టిలో ఉన్నందున సీడ్‌పార్కుకు కేటాయించిన భూముల సమగ్ర వివరాలు తెలుసుకోవటంతో పాటు వాటిని పరిశీలించినట్లు తెలిపారు. ఫారంలో సాగుచేసిన కందిపంటలో సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టడంతో పాటు రైతులకంటే అధిక దిగుబడులు సాధించాలని ఫారం అధికారులకు సూచించారు. ఫారం ఏడీఏ అరుణలత, ఏఓ లు కిషోర్, శ్రావణి తదితరులు ఉన్నారు.